క్లుప్తంగా

ఎమ్మార్పీఎస్ డివిజన్ అధ్యక్షుడిగా ఉప్పలయ్య



చెన్నారావుపేట: మండల కేంద్రానికి చెందిన ఆకులపల్లి ఉప్పలయ్యను ఎమ్మార్పీఎస్ నర్సంపేట డివిజన్ అధ్యక్షుడిగా నియమించినట్లు రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు కేదాసి మోహన్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయనకు నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా ఉప్పలయ్య మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మెట్టుపల్లి కొంరయ్య, బాలస్వామి, జిల్లా ప్రతినిధి బిక్షపతి, నాయకులు ఉన్నారు.

అన్నారం దర్గా టెండర్



పర్వతగిరి: మండలంలోని అన్నారంషరీఫ్ యాకుబ్‌బాబా దర్గా టెండర్‌ను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నారం గ్రామానికి చెందిన షబ్బీర్ అలీ రూ.2 కోట్ల 13లక్షలకు దక్కించుకున్నాడు. కాగా టెండర్ ఆర్డర్ కాపీని వక్ఫ్‌బోర్డు సూపరింటెండెంట్ అమీర్ అహ్మద్, ఓఎస్‌డీ ఎండీ.అసదుల్లాఖాన్, లీగల్ ఆఫీసర్ ఫయాజ్, వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ రియాజ్‌పాషా, సూపరింటెండెంట్ ముంతాజ్‌ల చేతుల మీదుగా అందుకున్నాడు.

అంగడి వేలం ఖరారు

పర్వతగిరి: మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం అంగడి వేలం నిర్వహించగా 2024–25 సంవత్సరానికి నర్సంపేటకు చెందిన పాలకుర్తి ప్రభాకర్ రూ.8లక్షల 11వేలకు దక్కించుకున్నట్లు స్పెషల్ ఆఫీసర్, ఎంపీడీఓ శంకర్ తెలిపారు. జీపీకి సంబంధించి 20 రూములకు సరైన వేలం పాట రానందున ఈనెల 28న తిరిగి వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు రాజు, మహేంద్ర, ఎంపీఓ పాక శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యాకమిటీ ఎన్నిక

దుగ్గొండి: మండలంలోని మందపల్లిలో విద్యా కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. చైర్మన్‌గా మేదరి పద్మ, కన్వీనర్‌గా పాఠశాల హెచ్‌ఎం కర్ణకంటి రామ్మూర్తి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులుగా రాంపాక జ్యోతి, మాతంగి శైలజ, శైలజ, మొలుగూరి రాణి, తుమ్మలపల్లి మౌనిక, రేణుకుంట్ల కోమల, రేవూరి సుమలత, పెండ్యాల జ్యోతి ఎన్నికయ్యారు.

కాంగ్రెస్‌లో చేరిక



సంగెం: మండలంలోని బీకోజీనాయక్ తండాకు చెందిన వార్డు సభ్యులతో పాటుగా పలువురు కాంగ్రెస్‌లో చేరారు. శుక్రవారం హనుమకొండలోని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి స్వగృహంలో మాజీ సర్పంచ్ బానోత్ విద్యావతి కుమారుడు వంశీతో వార్డు సభ్యులు గుగులోత్ రాజు, బిచ్చా, పార్టీ గ్రామ అధ్యక్షుడు భూక్య వీరన్న, నాయకులు రవీందర్, తిరుపతి, అభిలాష్, చంటి లకు పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు.

చికిత్స పొందుతున్న వృద్ధురాలి మృతి

ఖానాపురం: చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి చెందిన సంఘటన మండలంలోని అశోక్‌నగర్‌లో చోటుచేసుకుంది. ఎస్సై రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం...అశోక్‌నగర్‌కు చెందిన ఎల్లమ్మ(65) రోజు మాదిరిగానే ఇంట్లో పనులు చేసుకుంటుంది. పన్నెండు రోజుల క్రితం ఇంటి వద్ద ఉన్న బావివద్ద కిందపడిపోయింది. ఆ తర్వాత కొద్ది రోజులకు ఆరోగ్యం క్షీణించడంతో ఇటీవల ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందింది. మృతురాలి కుమారుడు కుమారస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ట్రెజరీ ఉద్యోగులకు సన్మానం

నర్సంపేట రూరల్ : మండల ఎస్‌టీఓ కార్యాలయ సిబ్బందిని ఆర్థిక సంవత్సరం పూర్తవుతున్న సందర్భంగా ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు సన్మానించారు. ఎస్‌టీఓ కార్యాలయంలో ఏటీఓ బెనర్జీ, సీనియర్ అసిస్టెంట్లు కృష్ణప్రసాద్, అనూష, విష్ణు, భునేష్‌లను శాలువాతో ఘనంగా సన్మానించారు.

మజీద్ కమిటీ ఎన్నిక

రాయపర్తి: మండలకేంద్రంలోని అలంగిరి మజీద్ కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. గౌరవ అధ్యక్షుడిగా ఎండీ నయీం, మస్జీద్ సదర్‌గా ఎండీ అమ్జద్‌ఖాన్, నాయబ్ సదర్‌గా ఎండీ గౌస్‌ఖాన్, ప్రధానకార్యదర్శిగా ఎండీ అఫ్రోజ్‌ఖాన్, కోశాధికారిగా ఎండీ యాసిన్‌ఖాన్, మౌజాన్‌గా ఎండీ ఫెరోజ్‌ఖాన్ కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

మామూళ్లు లేనిదే బిల్లులు చేయరా?

- జెడ్పీటీసీ మార్గం భిక్షపతి
- పీఆర్ ఏఈ, జెడ్పీటీసీ మధ్య తీవ్ర వాగ్వాదం
- మండల సర్వసభ్య సమావేశం



వాగ్వాదం చేసుకుంటున్న జెడ్పీటీసీ, పీఆర్ ఏఈ

వర్ధన్నపేట: చేసిన పనులకు మామూళ్లు లేనిదే బిల్లులు చేయరా అని పీఆర్ ఏఈ రాజేందర్‌రెడ్డిపై జెడ్పీటీసీ మార్గం భిక్షపతి మండల సభలో తీవ్రమైన ఆరోపణలు చేయడంతో సభలో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. శుక్రవారం మండల పరిషత్ హాల్‌లో ఎంపీడీఓ వెంకటరమణ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. సభకు పలు విభాగాల అధికారులు గైర్హాజర్ కావడంతో పాటు, పలుశాఖల అధికారుల తీరుపై పలువురు సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పీఆర్ ఏఈ రాజేందర్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి పనులపై సభలో వివరిస్తుండగా జెడ్పీటీసీ భిక్షపతి ఆరోపణ చేస్తూ మండలంలో సీసీ రోడ్లు, ఇతర భవన నిర్మాణాల పనులు పూర్తి చేసినా వాటికి సంబంధించిన బిల్లులు చేయకపోవడంతో సర్పంచ్‌లకు, పనులు చేసిన వారికి బిల్లులకు రాక నానా అవస్థలు పడుతున్నారన్నారు. చేసిన పనులకు డబ్బులు ఇస్తేనే బిల్లులు చెల్లిస్తారా అంటూ జెడ్పీటీసీ ధ్వజమెత్తారు. అదే తీరులో తనను బదిలీ చేయించడని పీఆర్ ఏఈ సమాధానం ఇవ్వడంతో పాటు వాగ్వాదానికి దిగారు. తాను బిల్లులు చేసి కార్యాలయంలో ఇచ్చానని ఆ బిల్లులు ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుందని అది తన బాధ్యత కాదని తెలపడంతో తాము కార్యాలయంలో అధికారులను అడిగితే ఏఈ బిల్లులు చెయ్యనిది తాము ఏమి చేయలేమని అక్కడ సమాధానం ఇస్తున్నారని భిక్షపతి అన్నారు. దీంతో మాటామాట అనుకోవడంతో ఎంపీపీ అప్పారావు జోక్యం చేసుకుని శాంతింపచేశారు. సీడీపీఓ శ్రీదేవి మాట్లాడుతుండగా ఎంపీపీ అప్పారావు ప్రశ్నిస్తూ మండలంలో పలుచోట్ల అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల సంఖ్య ఉండడం లేదు. అదేవిధంగా సిబ్బంది విధులకు సక్రమంగా హాజరుకావడం లేదన్నారు. దీనికి తోడు కేంద్రాల్లో పిల్లలకు, గర్భిణులకు అందించాల్సిన వస్తువులు దుర్వినియోగం అవుతున్నాయి. ఎంపీఓ ధనలక్ష్మి మాట్లాడుతుండగా సభ్యులు ప్రశ్నిస్తూ ఇల్లంద, కట్య్రాల, ఉప్పరపల్లి గ్రామాల పరిధిలో అక్రమ వెంచర్లు వెలిస్తే వాటిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారని అడుగగా తాము సంబంధిత వ్యక్తులపై అధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలపగా వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ఎస్సీ బాలికల వార్డెన్ గీతను ప్రశ్నిస్తూ వసతి గృహంలో బాలికల సంఖ్య బాగా తగ్గిందని బాలికల సంఖ్యను పెంచాలన్నారు. సమయానికి భోజనం, ఇతర వసతులు అందించాలని సూచించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ సోమలక్ష్మి, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్గూర్‌రంగంపేట లెవల్ క్రాసింగ్ తొలగింపు

- అండర్ బ్రిడ్జి నిర్మాణం ప్రారంభం
- అసంపూర్తి పనులు పూర్తి చేయాలని గ్రామస్తుల డిమాండ్
- ఇబ్బందులు లేకుండా చేస్తామని ఐఓడబ్ల్యూ హామీ



అండర్ బ్రిడ్జిని ఓపెన్ చేస్తున్న జేసీబీ

సంగెం: వరంగల్–విజయవాడ రైల్వేలైన్‌లోని మండలం ఎల్గూర్‌రంగంపేట వద్ద గల 68/ఇ రైల్వే లెవల్‌క్రాసింగ్ గేట్‌ను పూర్తిగా తొలగిస్తున్నట్లు ఐఓడబ్ల్యూ శ్రీనివాస్ తెలిపారు. థర్డ్‌లైన్ నిర్మాణం తర్వాత లెవల్ క్రాసింగ్ వద్ద ప్రయాణికులు ఎక్కువ సమయం వేచి ఉంటున్నారని దీనికోసం ఇక్కడ అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఈ నిర్మాణం పూర్తి అవడంతో లెవల్ క్రాసింగ్ గేట్‌ను తొలగించామన్నారు. సిగ్నల్ రూంను పూర్తిగా తొలగించి దాని స్థానంలో అండర్ బ్రిడ్జిలో నీరు నిలువ ఉండకుండా బావి నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. అసంపూర్తి నిర్మాణ పనులతో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతాయని మాజీ సర్పంచ్‌లు పోతుల ప్రభాకర్, జనగాం రమేష్, పెద్దగోని లక్ష్మీనారాయణ, మాజీ ఉపసర్పంచ్‌లు బోగి రవి, గట్ల సత్యం, నాయకులు బోనాల శ్రీనివాస్, కంది కిషన్, కదారి సాంబయ్య, వంశీ, పసునూరి అశోక్ తదితరులు యూబీ అసంపూర్తిగా ఉందని గేట్‌ను తొలగించవద్దని ఐఓడబ్ల్యూ దృష్టికి తీసుకుని రాగా అభివృద్ధి పనులు అడ్డుకోవద్దని ప్రజలకు ఇబ్బందులు లేకుండా నాణ్యతతో కూడిన అండర్‌బ్రిడ్జి పనులు చేయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్‌పీఎఫ్ ఏఎస్సై పి. వెంకటేశ్వర్‌రావు, హెచ్‌సీ శ్యామ్ సురేష్, జీఆర్‌పీ కానిస్టేబుల్ సదానందం, సంగెం కానిస్టేబుల్ కుమారస్వామి, హోంగార్డు కోటి తదితరులు పాల్గొన్నారు.

‘సిద్ధార్థ’లో మెగా జాబ్ ఫెయిర్



మెగా జాబ్ ఫెయిర్‌కు హాజరైన విద్యార్థులు

నర్సంపేట: పట్టణంలోని సిద్ధార్థ డిగ్రీ, పీజీ కళాశాల వారు మేజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ కలిసి శుక్రవారం కళాశాలలో మెగా జాబ్ ఫెయిర్ నిర్వహించారు. జాబ్‌ఫెయిర్‌ను కళాశాల ప్రిన్సిపాల్ గోగుల ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో విద్యనభ్యసించే విద్యార్థులకు కార్పొరేట్ ఉద్యోగ అవకాశాలు కల్పించుటకు చేస్తున్న కృషిలో భాగమే జాబ్ ఫెయిర్ అన్నారు. జెన్‌పాక్ట్, టెలిఫర్‌ఫామెన్స్, క్యూ కనెక్ట్, ఆర్‌బీఎస్, భారత్ మ్యాట్రిమోనీ, ఎస్‌ఆర్‌ఆర్ ఎంటర్ ప్రైజెస్, ముత్తూట్ ఫైనాన్స్, బిగ్ సీ తదితర సంస్థలచే ఇంటర్వ్యూలు నిర్వహించగా సుమారు 200 మంది విద్యార్థులు హాజరు కాగా వీరిలో 65 మందిని ఎంపిక చేసినటుల తెలిపారు. కార్యక్రమంలో మేజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ప్రతినిధులు పి.వెంకట్, రాఘవకుమార్, ఏఓ పరమేశ్వర్, శ్రీధర్, పాల్గొన్నారు.

ఆకాశవాణిలో అలరించిన చైతన్యకార్యక్రమం



దుగ్గొండి: అంతర్జాతీయ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని నాచినపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు శుక్రవారం ఆకాశవాణి వరంగల్ కేంద్రంలో చిన్నారిలోకం కార్యక్రమంలో అలరించారు. నదీమ తల్లీ నీకు వందనం నాటిక ప్రదర్శన, నీరే కదా నాగరికతకు మూలం, భూమాత మనోవేదన ఏకపాత్రాభినయం ఉపాధ్యాయురాలు వెలిదండి సుమలత ఆధ్వర్యంలో ప్రదర్శించారు. విద్యార్థులను హెచ్‌ఎం జ్యోతిలక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు.

యువత చేతిలోనే రాష్ట్ర భవిష్యత్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రామానంద్

నర్సంపేట: యువత చేతిలోనే రాష్ట్ర భవిష్యత్ ఉందని, యువత సన్మార్గంలో నడవాలని టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్ అన్నారు. పట్టణంలోని సర్వాపురంలో ఎస్‌పీఎల్ సీజన్–2 ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడలను శుక్రవారం నర్సంపేట–చంద్రుగొండ గ్రామాల మధ్య జరుగుతున్న క్రికెట్ పోటీలను టాస్ వేసి మ్యాచ్‌ను ప్రారంభించారు. అనంతరం క్రికెట్ టీం సభ్యులకు టీ షర్ట్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెడు వ్యసనాలకు బానిస కాకుండా యువత శారీరకంగా మానసికంగా దృఢంగా ఉండడానికి కృషి చేయాలన్నారు. అనంతరం టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, పట్టణ అధ్యక్షుడు బత్తిని రాజేందర్‌ను కాంగ్రెస్ నాయకులు కొప్పుల అశోక్, పున్నం నర్సింహారెడ్డి, ధోని చేరాలు, ఎర్రబెల్లి ప్రదీప్, కొప్పు గాంధీ, ఈదుల రమేష్, ఎడ్ల రాజేష్‌లు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి తుమ్మలపల్లి సందీప్, పట్టణ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పంబి వంశీకృష్ణ, పట్టణకార్యదర్శి చిప్ప నాగ, కోల చరణ్‌రాజ్, బిట్ల మనోహర్, శ్రీకాంత్, పట్టణ యూత్ అధ్యక్షుడు ఎస్‌కె.షఫిక్, మహేష్, విక్రమ్ పాల్గొన్నారు.

పశువుల ఆరోగ్యమే రైతులకు మహాభాగ్యం



నర్సంపేట రూరల్ : కమ్మపల్లిలో పశువుకు టీకా వేస్తున్న సిబ్బంది

సంగెం: పశువులు ఆరోగ్యంగా ఉంటేనే రైతులు ఆనందంగా ఉంటారని మండల పశువైద్యాధికారి వల్లే రాజు అన్నారు. శుక్రవారం మండలంలో నిమొండ్రాయి, గొల్లపల్లి గ్రామాల్లోని పశువులకు గాలికుంటు నివారణ టీకాలను వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులు వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతులు ఎప్పటికప్పుడు పశువైద్యుల సలహాలు, సూచనలు పాటించి పశుసంపదను కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో గోపాల మిత్రలు కమలాకర్, బాబు, జితేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నర్సంపేట రూరల్ : పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని భాంజీపేట వైద్యాధికారి వింద్య, జెడ్పీటీసీ కోమాండ్ల జయమ్మ అన్నారు. మండలంలోని కమ్మపల్లిలో గోపాలమిత్ర సెంటర్‌లో పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది సత్యనారాయణ, జయరామ్, సురేందర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అందిన వేతనాలు

సాక్షి స్పందన

నల్లబెల్లి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు పెండింగ్ వేతనాలను ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసింది. ఈ నెల 16న సాక్షిలో ‘మూడు నెలలుగా జీతాల్లేవ్’ శీర్షికన ప్రచురితమైన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. ఔట్‌సోర్స్ ఉద్యోగులుగా పనిచేస్తున్న ఏపీఓ, ఈసీ, సీఓ, ఎఫ్ఏలకు వేతనాలను విడుదల చేశారు.

సమస్యలు పరిష్కరిస్తేనే పన్నులు కడతాం



తమ సమస్యలను మున్సిపల్ సిబ్బందికి వివరిస్తున్న తండావాసులు

వర్ధన్నపేట : పేరుకే మున్సిలిటీ అని తమ తండాల్లో సమస్యలతో సతమతం అవుతున్నామని నీరు లేదు, విద్యుత్ సరఫరా సరిగా లేదు తదితర సౌకర్యాలు లేవన్నారు. అయినా తమను ఇంటి పన్నులు కట్టాలని ఎలా వస్తారని శుక్రవారం మున్సిపల్ సిబ్బందిని తండావాసులు నిలదీసిన ఘటన డీసీ తండాలో చోటు చేసుకుంది. ఇంటి పన్నుల వసూళ్లలో భాగంగా వారి టార్గెట్‌ను పూర్తి చేసుకోవడానికి మున్సిపల్ సిబ్బంది శుక్రవారం డీసీ తండాకు వెళ్లారు. దీంతో తండావాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ తమ తండాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించరు కాని పన్నుల వసూళ్లకు వస్తారా అని నిలదీశారు. తమ తండాల్లోని సమస్యలు తీర్చితేనే తాము ఇంటి పన్నులు చెల్లిస్తామని తెలపడంతో వచ్చిన సిబ్బంది వెనుతిరిగి వెళ్లి పోయారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



పంట కోత ప్రయోగం చేస్తున్న అధికారులు

వర్ధన్నపేట: వేరుశనగ సాగులో మెలకువలు, యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయ అధికారులు తెలిపారు. జాతీయ ఆహార భద్రత మిషన్ నూనె గింజల పథకం కింద మండలంలోని చెన్నారంలో శుక్రవారం అధికారులు పంటకోత ప్రయోగం చేపట్టారు. గ్రామంలోని రైతులు మంద నర్సయ్య, మంద అశోక్ రైతులకు చెందిన వేరుశనగ పంట క్షేత్రాల్లో వేరు శనగ మినీకిట్స్ కోసం పంట కోత ప్రయోగం(క్రాప్ కటింగ్ ఎక్స్‌పర్‌మెంట్) నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ రైతుల సమక్షంలో వేరుశనగ పంట కోత ప్రయోగం చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ఆయిల్ సీడ్స్, డెవలప్‌మెంట్ హైద్రాబాద్ అధికారులు పుష్పలత, గణేష్, హైదరాబాద్, శాస్త్రవేత్త డాక్టర్ సౌమ్య, కెవికె మామునూరు, ఎన్ఎఫ్ఎస్ఎం కన్సల్టెంట్ పి సారంగం, టెక్నికల్ అసిస్టెంట్ రవికుమార్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వాడుకోవాలి



నర్సంపేట: నీటి ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు



వర్ధన్నపేట: ఉప్పరపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



రాయపర్తి: సన్నూరులో బాలవికాస ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేస్తున్న ప్రతినిధులు, విద్యార్థులు

నర్సంపేట: ప్రతి ఒక్కరూ నీటి ఆవశ్యకతను గుర్తించి నీటిని పొదుపుగా వాడుకోవాలని ప్రతిభ సంస్థ నిర్వాహకుడు గిరగాని సుదర్శన్‌గౌడ్ సూచించారు. పట్టణంలో ప్రతిభ, స్వయంకృషి సంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ నీటిదినోత్సవం సందర్భంగా విజడమ్ పాఠశాలలో కరస్పాండెంట్ జావీద్ అధ్యక్షతన నీటి పొదుపుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్వయంకృషి సంస్థ నిర్వాహకుడు బెజ్జంకి ప్రభాకర్ మాట్లాడుతూ నీరే ప్రాణధారమని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. ప్రపంచ యుద్ధాలలో మృతి చెందిన వారి కన్నా కలుషిత నీటి వల్ల మృతి చెందిన వారే ఎక్కువగా ఉన్నారని తెలిపారు. నీటి పొదుపుతో పాటు నీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకొని స్వచ్ఛమైన నీటిని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులచే నీటి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

దుగ్గొండి: భవిష్యత్ తరాల కోసం నీటిని పొదుపుగా వాడుకోవాలని బాలవికాస సంస్థ ప్రతినిధి శ్రీదేవి అన్నారు. ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని తొగర్రాయి ప్రభుత్వ పాఠశాలలో బాలవికాస ఆధ్వర్యంలో విద్యార్థులకు నీటి ఆవశ్యకతపై శుక్రవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ ఓడేటి తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

వర్ధన్నపేట: నీటిని వృథా చేయకుండా కాపాడుకుని వినియోగించుకోవాలని ఉప్పరపల్లి ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం వేణు అన్నారు. ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మండలంలోని ఉప్పరపల్లిలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ప్లకార్డులు చేతబూని నీటిని వృథా చేయవద్దని, నీటిని ఒడిసి పట్టాలని, సద్వినియోగం చేసుకోవాలని నినాదాలు చేస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ నీటి పొదుపు గురించి వివరించారు. విద్యార్థుల చేత నీటి వినియోగంపై ఉపన్యాస పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పీఎస్ పాఠశాల హెచ్‌ఎం బి సాంబయ్య, బాలవికాస ప్రతినిధులు రాణి, ఫాతీమా, అనురాధ, స్వాతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రాయపర్తి: నీటిని పొదుపుగా వాడుకోవాలని కోరుతూ మండలంలోని సన్నూరులో బాలవికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బాలవికాస ప్రతినిధి వై.రమ మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి ప్రభాకర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎస్సైలను కలిసిన నాయకులు



ఖానాపురం: ఎస్సైని సన్మానిస్తున్న కాంగ్రెస్ నేతలు

ఖానాపురం: ఇటీవల నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన రఘుపతిని మహిళా కాంగ్రెస్ నేతలు ప్రమీల, వరలక్ష్మి, వెంకటమ్మ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఎస్సై రఘుపతి మాట్లాడుతూ శాంతిభద్రల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఎస్సైని కలిసిన వారిలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శాఖమూరి హరిబాబు, ఉపేందర్, ఎల్లగౌడ్, లాల్‌సాహెబ్, కొంరయ్య తదితరులు ఉన్నారు.

పర్వతగిరి: ఎస్సైగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన వెంకన్నను పీఏసీఎస్ చైర్మన్ గొర్రె దేవేందర్, వైస్ చైర్మన్ మధుసూదన్‌రావులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కలిసిన వారిలో మాజీ ఎంపీపీ రంగయ్య, నరేందర్, సాంబయ్య ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

రాయపర్తి: మండలంలోని మహబూబ్‌నగర్‌కు చెందిన తాటిపెల్లి సమ్మయ్య అనారోగ్యంతో మృతిచెందగా కాంగ్రెస్ నాయకులు పార్థీవదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. తొర్రూరు బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్, మండల పార్టీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి మృతుడి కుమారుడు రాజును పరామర్శించారు. మండల యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ మహమూద్, ఎస్సీసెల్ జిల్లా కన్వీనర్ ఇల్లందుల భగవాన్, తదితరులు ఉన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న పరమేశ్వర్

నల్లబెల్లి: ప్రతి ఒక్కరూ పోషకాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని మండల వ్యవసాయాధికారి, కన్నారావుపేట స్పెషలాఫీసర్ పరమేశ్వర్ అన్నారు. మండలంలోని కన్నారావుపేటలో పోషణపక్షం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. పోషకాహారంపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఝాన్సీరాణి గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణుల పోషకారం తీసువడంతో బిడ్డ ఆరోగ్యంగా ఎదుగుతుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, శ్రీకాంత్, ఏఈవో భాస్కర్, ఉపాధ్యాయుడు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం



కల్యాణ వేడుకల్లో పాల్గొన్న భక్తులు

చెన్నారావుపేట: మండలంలోని కోనాపురంలో ఊరగుట్టపై వెలసిన శ్రీ లక్ష్మీనర్సింహస్వామి కల్యాణ మహోత్సవ వేడుకలు గురువారం రాత్రి వైభవంగా జరిగాయి. అర్చకులు శివకృష్ణ చార్యులు, రణధీర్‌శర్మ, సాయిశర్మ, గురుబ్రహ్మచార్య, నాగరాజు, నితిన్, కౌషిక్ శర్మలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అష్టోత్తర ఘట్టాభిషేకం, హోమాలు నిర్వహించారు. ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా కల్యాణ వేడుకలు తిలకించే విధంగా ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కల్యాణ వేడుకల్లో ఎంపీటీసీ గుండాల మహేందర్, మాజీ సర్పంచ్ వెల్దె సుజాత సారంగం, మాజీ ఉప సర్పంచ్ మండల నర్సింహరాములు,నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో రాణించాలి



సీఎం, ఎమ్మెల్యేల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న ముదిరాజ్‌లు

నెక్కొండ: ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో రాణించాలని ముదిరాజ్ సంక్షేమ సంఘం మండల నాయకులు అన్నారు. మండల కేంద్రంలోని తెలంగాణ సెంటర్‌లో శుక్రవారం ముదిరాజ్‌లకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుపై వారు సీఎం రేవంత్‌రెడ్డి, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజాపాలన దిశలో ముందుకు సాగడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు దుండి రవి, యాట ఉప్పలయ్య, చొప్పరి దూడయ్య, వాకిటి సమ్మయ్య, దుండి రాజు ముద్రబోయిన శ్రీకాంత్, రాజశేఖర్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

ఖానాపురం: మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు అని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ మైనార్టీ నాయకుడు ఎండీ.అజార్ రంజాన్‌ను పురస్కరించుకొని ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఇఫ్తార్ విందుకు హాజరైన పెద్ది మాట్లాడుతూ రంజాన్‌ను భక్తి శ్రద్ధల నడమ జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, జెడ్పీటీసీ బత్తిని స్వప్న, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకటనర్సయ్య, పూలునాయక్, రామస్వామి, అశోక్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు. అలాగే కొత్తూరుకు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు బాలు అనారోగ్యంతో బాధపడుతుండగా పెద్ది పరామర్శించారు.